
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY





## మార్చి చివరి వరకే కేసీకి నీరు

చెన్నూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వేసవిని దృష్టిలో ఉంచుకుని రైతుల సాగునీటి కోసం కేసీ కాల్వకు నీటి సరఫరా 2026 మార్చి చివరి వరకు మాత్రమే ఇచ్చేందుకు ఇరిగేషన్ అడ్వయిజరీ బోర్డు సమావేశంలో నిర్ణయించినట్లు కేసీ కెనాల్ ఏఈ గంగిరెడ్డి తెలిపారు. రబీ సీజన్‌లో నీటి లభ్యత పరిమితుల కారనంగా రైతులు కూడా ఆరుతడి పంటలే సాగు చేసుకోవాలని అధికారులు నిర్ణయించారని అన్నారు. ఆ మేరకు రైతులు సిద్ధపడాలని ఆయన తెలిపారు. మార్చి నెలాఖరు తర్వాత కేసీ కాల్వకు నీటి విడుదల ఉండదన్నారు.

## 5న మెగా మీటింగ్




కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈనెల 5వ తేదీ ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు పండుగ వాతావరణంలో మెగా పేరెంట్-టీచర్ మీటింగ్ నిర్వహిస్తున్నట్లు ఆర్ఐఓటి ఎస్‌వీ వెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వికసిత్ ఆంధ్రప్రదేశ్-2047 లక్ష్యంతో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మధ్య బంధాన్ని బలపరచడం, కళాశాలల మధ్య సమన్వయాన్ని పెంపొందించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో పాటు పూర్వ విద్యార్థులు కూడా పాల్గొని సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు సమగ్ర ప్రగతి నివేదికలను పంపిణీ చేస్తామని తెలిపారు.

## ప్రైవేట్ బస్సు బోల్తా

● మహిళ మృతి, పలువురికి గాయాలు


బోల్తా పడిన బస్సు

శ్రీనివాసపురం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): బద్వేలు నుంచి బెంగళూరుకు వెళుతున్న ప్రైవేట్ హరిత ట్రావెల్స్ బస్సు డివైడర్‌ను ఢీకొని అదుపుతప్పి బోల్తా పడింది. శ్రీనివాసపుర తాలూకా మంచినీళ్లకోటె గ్రామం వద్ద మంగళవారం తెల్లవారుజామున సుమారు 3 గంటలకు బస్సు ప్రమాదానికి గురైంది. ఘటనా స్థలంలో ప్రొద్దటూరుకు చెందిన అనిత (58) మృతి చెందింది. పదిమందికిపైగా ప్రయాణికులు గాయపడ్డారు. క్షతగాత్రులను మదనపల్లి, శ్రీనివాసపుర, కోలారు ప్రభుత్వ ఆసుపత్రులకు తరలించారు. ఘటనా స్థలాన్ని రాయల్పాడు పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

మహిళా భద్రతపై
ప్రత్యేక దృష్టి సారించాలి 5

# సంకల్పంతో.. సాధించారు..!

● ఆత్మస్థైర్యంతో నిలదొక్కుకుంటున్న మానసిక దివ్యాంగులు
● నేడు అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రతిభ, సంకల్పం ఉన్న వారికి ఏదీ అడ్డంకి కాదని మానసిక దివ్యాంగులు నిరూపిస్తున్నారు. కుటుంబ సభ్యుల సహకారం, ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, సేవా సంస్థల ప్రోత్సాహం వారి జీవితానికి ఒక కొత్త దిశను చూపుతున్నాయి. జీవితాన్ని సవాల్‌గా స్వీకరించి అనేక మంది దివ్యాంగులు స్వశక్తితో నిలదొక్కుకుంటున్నారు. క్రమశిక్షణతో నేర్చుకుంటూ, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతున్నారు. ప్రతిభకు వైకల్యం అడ్డుకాదని నిరూపిస్తున్న మానసిక దివ్యాంగుల జీవితం ఎందరికో ఆదర్శంగా నిలుస్తోంది. జిల్లాలో గత ఏడాది అధికారుల గణాంకాల ప్రకారం దాదాపు 82,000 మంది దివ్యాంగులు ఉన్నారు. వారిలో మానసిక దివ్యాంగులు సుమారు 6,500 మంది, ప్రత్యేక పాఠశాలల్లో చేరిన విద్యార్థులు 1,850 మంది, నైపుణ్యాభివృద్ధి శిక్షణ పొందిన దివ్యాంగులు 1120 మంది, స్వయం ఉపాధి చేపట్టిన వారు 430మంది ఉన్నారు. ప్రస్తుతం సర్కారు పింఛన్‌ను 36,609 మంది పొందుతున్నారు.


ప్రస్తుతం బట్టల షాపులో పనిచేస్తున్న షాహిద్

### బట్టల దుకాణంలో సేల్స్‌మన్‌గా

కడప నగరానికి చెందిన షాహిద్ (22) జన్మతః మానసిక దివ్యాంగుడు. చిన్నప్పుడు మాట్లాడడంలో, ఇతరులతో కలవడంలో చాలా ఇబ్బంది పడ్డాడు. స్థిరంగా ఒకచోట ఉండేవాడు కాదు. హైపర్ ఆక్టివిటీతో ఎప్పుడూ తిరుగుతూ ఒక పనికూడా సక్రమంగా చేయకుండా, చెప్పింది రాయకుండా ఉండేవాడు. అటువంటి అబ్బాయి మానసిక దివ్యాంగుల పునరావాసకేంద్రంలో చేరి బిహేవియర్ మాడిఫికేషన్ స్కిల్స్ నేర్చుకుని సామాన్యుడిలా మారాడు. ప్రస్తుతం షాహిద్ కడప నగరంలోని ఓ బట్టల షాపులో సేల్స్‌మన్‌గా పనిచేస్తున్నాడు. తన పనులు తాను చేసుకుంటూ ఒకరిపై ఆధారపడకుండా జీవనం సాగిస్తున్నాడు.


పునరావాస కేంద్రంలో ఉన్న షాహిద్ (చిన్నప్పటిది)

### డెకరేషన్‌లో ఆసక్తితో..



శివకుమార్(25)ది కడప నగరం. ఇతనికి తండ్రి లేడు. తల్లి ఇళ్లలో పాచిపని చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. శివకుమార్‌కు హైపర్ ఆక్టివిటీతో పాటు కొద్దిగా మతిమరుపు ఉండేది. అయితే డెకరేషన్ చేయడంలో ఆసక్తి చూపిస్తుండేవాడు. పునరావాస కేంద్రంలో శివకుమార్ ఆసక్తిని గుర్తించి దానిపై శిక్షణ ఇచ్చారు. కొంతకాలానికి పూర్తిగా శివకుమార్ తేరుకుని అదే డెకరేషన్ వృత్తిలో కొనసాగుతున్నాడు. ప్రస్తుతం నెలకు రూ.10 వేల నుంచి రూ.15వేలు స్వయం ఉపాధి పొందుతున్నాడు.

### జాలి కాదు.. చేయూత ఇవ్వాలి



మానసిక దివ్యాంగులలో మార్పు రావాలంటే వారికి కావాల్సింది జాలి కాదు.. చేయూత. మానసిక దివ్యాంగులకు చేయూత నందిస్తే వారు సాధారణ వ్యక్తులకు ఏమాత్రం తీసిపోమని నిరూపిస్తారు. వారిని చైతన్యవంతులను చేయాలంటే ముందుగా వారిలో ఉన్న నైపుణ్యాలను గుర్తించగలగాలి. దేనిపై ఎక్కువ మక్కువ చూపుతారో దానిపైన వాళ్లకు శిక్షణ ఇచ్చామంటే త్వరగా కోలుకుంటారు. మానసిక దివ్యాంగులకు ప్రభుత్వం ఎటువంటి నిబంధనలు లేకుండా అందరిలా పింఛన్ ఇవ్వాలి.

- ఎస్.మహమ్మద్ రఫి, అల్‌షిఫా మానసిక వికలాంగుల పునరావాసకేంద్రం వ్యవస్థాపకులు

అతిగా మద్యం తాగి వ్యక్తి మృతి 5 ఆక్రమణలో కోనేటి గుంత

# ఆధ్యాత్మిక కేంద్రం జ్యోతిక్షేత్రం

● రేపటి నుంచి 30వ ఆరాధనోత్సవాలు


జ్యోతిక్షేత్రంలోని అవధూత కాశిరెడ్డి నాయన సమాధి


కాశిరెడ్డి నాయన కాంస్య విగ్రహం

కాశినాయన, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): భక్తుల కోర్కెలు తీర్చే కొంగు బంగారంగా, ఆధ్యాత్మిక కేంద్రంగా అవధూత కాశిరెడ్డినాయన జ్యోతిక్షేత్రం విరాజిల్లుతోంది. నిత్యాన్నదానంతో ఆకలి గొన్నవారికి పట్టెడు అన్నం పెట్టి అక్కున చేర్చుకుంటోంది. ఎత్తైన నల్లమల కొండల నడుమ ఆహ్లాదకరమైన చల్లని వాతావణం మధ్య వరికుంట్ల గ్రామ సమీపంలో ఉన్న జ్యోతిక్షేత్రం పర్యాటకులను, భక్తులను ఆకట్టుకుంటోంది. జ్యోతిక్షేత్రంలోని కాశిరెడ్డి నాయన సమాధిని దర్శించుకుంటే తమ కష్టాలు తీరుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఇటీవల దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి సైతం యాత్రికులు వచ్చి జ్యోతిక్షేత్రాన్ని సందర్శిస్తున్నారు.

### ఎవరీ కాశినాయన...?

నెల్లూరు జిల్లా సీతారామాపురం మండలంలోని బెడుసుపల్లెకు చెందిన మునెల్లి కాశమ్మ, సుబ్బారెడ్డి దంపతులకు జన్మించిన రెండవ సంతానం కాశిరెడ్డి నాయన. కొత్తపల్లెలోని అవ్వ బాలమ్మ వద్ద పెరిగి వేమూరి రామయ్య వద్ద అక్షరాభ్యాసం చేశాడు. వెలిగండ్ల అతిరాచ గురవయ్య స్వామివద్ద శిష్యరికం చేసి ఆయన ఆధ్యాత్మిక భావాలకు ప్రభావితుడై ఆసేతు హిమాచలం వరకు కాలినడకన ప్రయాణిస్తూ అనేక పుణ్యక్షేత్రాలను దర్శించుకుంటూ సాగాడు. కడప, కర్నూలు, నెల్లూరు జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో పాడుబడిన దేవాలయాలను పునరుద్ధరించాడు. గోశాలలు, నిత్యాన్నదాన కేంద్రాలు ఏర్పాటు చేశాడు. ఇందులో భాగంగా సిద్దేశ్వరం, లింగయ్యకొండ, యోగానంద, కలుగొట్ల, గని, సీతారామాపురం, లింగాలదొన, జ్యోతి తదితర ప్రాంతాల్లో ఆశ్రమాలు నెలకొల్పి అందరి భాగస్వామ్యంతో నిత్యాన్నదాన కార్యక్రమాలను ఏర్పాటు చేయించాడు. కాశిరెడ్డి నాయన 1995లో మార్గశిర మాసం పౌర్ణమి దత్తజయంతి రోజున వరికుంట్ల సమీపంలోని నల్లమల అడవుల్లోని జ్యోతిక్షేత్రంలో యోగ సమాధిలో కూర్చున్నాడు. అక్కడ పాలరాతితో సమాధి నిర్మించారు. ప్రస్తుతం ఇక్కడ వివిధ కళాత్మక రూపాలతో కాశినాయన దేవాలయం నిర్మాణం జరుగుతోంది. ఆయన స్థాపించిన ఆశ్రమాలల్లో నిత్యాన్నదాన కార్యక్రమం నేటికీ కొనసాగుతోంది.

### రెండురోజులు ఆరాధనోత్సవాలు

అవధూత కాశినాయన యోగ సమాధి అయినప్పటి నుంచి ప్రతి సంవత్సరం జ్యోతిలో ఆరాధన మహోత్సవం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఈ నెల 4, 5 తేదీల్లో కాశినాయన 30వ ఆరాధన మహోత్సవం నిర్వహించనున్నారు. 4వ తేదీ గురువారం కాశినాయన పాలరాతి సమాధికి ప్రత్యేక పూజలు అభిషేకాలు హోమాలు, రాత్రికి జ్యోతి ప్రజ్వలన, రథోత్సవం నిర్వహిస్తారు. 5వ తేదీ శుక్రవారం పల్లకి ఉత్సవం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. ఈ రెండు రోజులు పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమాలు ఉంటాయి. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. జ్యోతి క్షేత్రానికి వెళ్లే భక్తులకోసం జిల్లాలోని అన్ని ప్రాంతాల నుంచి ఆర్టీసీవారు ఆరాధన మహోత్సవాలు నిర్వహించే రెండు రోజులపాటు ప్రత్యేక సర్వీసులు నడుపుతారు.

## వైభవంగా చర్చి వార్షికోత్సవం

కలసపాడు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కలసపాడులో సగిలేరు ఒడ్డున ఉన్న పురాతన పరిపేతురు పరిపౌలు చర్చి 138వ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు అనేక ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. సాయంత్రం కలసపాడు వాసి నంద్యాల బిషప్ కె.సంతోశ్ ఆయన సతీమణి బ్యూలాలను ఊరేగింపుగా చర్చి వద్దకు తీసుకెళ్లారు. క్రైస్తవ సంగీత విభావరి, పిల్లలచే సాంస్కృతిక కార్యక్రమాలు, దీపారాధన, కానుకలు సమర్పణ, యువజనుల సాంస్కృతిక కార్యక్రమాలు, రవికుమార్ బృందం చెక్కభజనలు, విజయవాడ గుణదల మాత నాట్యమండలి వారిచే ఏసుకృప క్రైస్తవ నాటకం తదితర కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. మైదుకూరు డీఎస్పీ రాజేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో పోరుమామిళ్ల సీఐ హేమసుందర్‌రావు, ఎస్ఐ తిమోతి బందోబస్తు ఏర్పాటు చేశారు. డాక్టర్ శైలజ, డాక్టర్ సాయితేజల ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు.


బిషప్ దంపతులను ఊరేగింపుగా తీసుకెళ్తున్న దృశ్యం

## ముగిసిన అడ్వెంచర్ నైపుణ్య శిక్షణ


గండికోటలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

జమ్మలమడుగు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పర్యాటక కేంద్రమైన గండికోటలో నవంబరు 28వ తేదీ నుంచి ఐదు రోజులపాటు నిర్వహించిన అడ్వెంచర్ నైపుణ్య శిక్షణ కోర్సు ముగిసింది. అడ్వెంచర్ కోర్సు అకాడమి వారు గండికోటలో నిర్వహించిన శిక్షణ మంగళవారంతో విజయవంతమైనట్లు శిక్షకులు తెలిపారు. ఈ కోర్సులో పాల్గొన్న ట్రైనీలకు అడ్వెంచర్‌లో భాగంగా వివిధ ప్రాథమిక నైపుణ్యాలు, భద్రత ప్రమాణాలు, టీం కోఆర్డినేషన్, ఫస్ట్ రెస్పాన్స్, నావిగేషన్, యాంకరింగ్, రెస్క్యూ టెక్నిక్స్ వంటి కీలక అంశాలపై సమగ్ర శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రైనీలకు టూరిజం జిల్లా అధికారి సురేశ్‌కుమార్, రామ్‌కుమార్ పలు సూచనలు చేశారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న టూరిజం రంగంలో నైపుణ్యంతో కూడిన సర్టిఫికేషన్ కలిగిన అడ్వెంచర్ నాయకులకు పెద్దస్థాయిలో డిమాండ్ ఉందన్నారు. అడ్వెంచర్ టూరిజం, ఎకోటూరిజం, ట్రెక్కింగ్‌లలో పాఠశాలలు, కళాశాలలు, క్యాంపులు, ప్రైవేటు అడ్వెంచర్ కంపెనీలు, ట్రావెల్, టూర్ ఆపరేటర్స్ వంటి విభాగాల్లో ట్రైనీలకు ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని తెలిపారు. అడ్వెంచర్ రంగంలో పనిచేసే వారికి ఉండాల్సిన ముఖ్య లక్షణాలు నాయకత్వం, బాధ్యత, భద్రత అని శిక్షకులు తెలిపారు.

## రూ.79 కోట్లతో అభివృద్ధి పనులు

● జనవరి మొదటివారంలో గండికోట ఉత్సవాలు ● కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి


గండికోటలో ఉత్సవాల ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

జమ్మలమడుగు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా పర్యాటక చారిత్ర, సాంస్కృతిక వైభవాన్ని దేశం నలుదిక్కులా చాటేలా గండికోట ఉత్సవాలను జనవరిలో నిర్వహించనున్నామని.. ఇప్పటికే టాస్కీ పథకం ద్వారా రూ.79 కోట్లతో ఇక్కడ అభివృద్ధి పనులు చేపట్టామని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. మంగళవారం గండికోట ఉత్సవాల ఏర్పాట్లు, టాస్కీ పర్యాటక అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. అనంతరం సమీక్ష సమావేశం నిర్వహించారు. గండికోట పర్యాటక కేంద్రం అభివృద్ధిలో భాగంగా చేపట్టే అన్ని రకాల పనులను, మ్యాపులను, డిజైన్లను పరిశీలించారు. పనుల నాణ్యతతో ఎలాంటి రాజీ లేకుండా చేపట్టాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ. జనవరి నెల మొదటి వారంలో గండికోట ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. గండికోట ప్రాంతాన్ని టాస్కీ పథకం ద్వారా రూ.79 కోట్లతో అభివృద్ధి చేస్తున్నామన్నారు. అందులో భాగంగా స్టార్‌హోటళ్లు, ఇతర ఆకర్షణీయమైన నిర్మాణాలు చేపడుతున్నామన్నారు. 10,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో టూరిస్టు ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను, 4,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో రెండు అమినిటీస్ ఇన్ఫర్మేషన్ సెంటర్లను ఏర్పాటు అవుతున్నాయన్నారు. ఒక టెంట్ సిటీ, 1.5 కి.మీ. మేర గండికోట పోర్టు నుంచి డిజిటర్స్ సెంటర్ వరకు వాకింగ్ ట్రాక్ నిర్మిస్తామన్నారు. వెహికల్ ఫ్రీజోన్‌గా కేటాయించి ఇరువైపుల పర్యాటకులు చక్కటి ఆహ్లాదకరమైన అనుభూతిని పొందేలా పలు ప్రత్యేక నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. చారిత్రక వైభవాన్ని ప్రతిబింబించేలా శ్రీకృష్ణదేవరాయుల విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. రోప్‌వే, గ్లాస్‌బాటమ్ వాక్‌వే, లైట్ అండ్ సౌండ్ షోలను ఏర్పాటు చేస్తామన్నారు. గ్రాండ్ క్యానన్‌ను ఆకాశం నుంచి వీక్షించేందుకు హెలిరైడ్స్ సదుపాయం కల్పిస్తామన్నారు. భవిష్యత్తులో హైదరాబాదు, బెంగళూరు, చెన్నై ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులకు కారావాన్ టూరిజం సర్వీసులు అందుబాటులోకి వస్తాయన్నారు. అనంతరం గండికోట, కొట్టాలపల్లె నుంచి గండికోట రిజర్వాయర్ డ్యాం అందాలను వీక్షించేందుకు ఆ మార్గాన్ని కలిపే అనుకూలతలను, ఒబెరాయ్ స్టార్‌హోటల్ నిర్మించే ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో సాయిశ్రీ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు సుబ్రమణ్యం, ఎస్ఈ మద్దన్న, జిల్లా టూరిజం అధికారి సురేశ్‌కుమార్, ఆర్ అండ్‌బీ ఎస్ఈ భాస్కర్‌రెడ్డి, ప్రాజెక్టు మేనేజర్ గోపీనాథ్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గండికోట లోయవద్ద ఫొటోలు తీస్తున్న కలెక్టర్



# అభివృద్ధికి బ్రేక్..!

● 17 నెలలుగా కుంటుపడుతున్న అభివృద్ధి పనులు
● 15 ఫైనాన్స్ పనులు అజెండాకు తేని వైసీపీ పాలకమండలి
● రూ.30 లక్షల డిపాజిట్ వెనక్కు ఇవ్వని వైనం
● కౌన్సిల్లో వైసీపీ తీరును ఎండగట్టలేని టీడీపీ సభ్యులు
● ఇదీ ప్రొద్దుటూరు మున్సిపాలిటీ తీరు




ప్రొద్దుటూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చి 17 నెలలు దాటింది. ప్రొద్దుటూరులో టీడీపీ అభ్యర్థిగా నంద్యాల వరదరాజులరెడ్డి గెలుపొందారు. కానీ మున్సిపాలిటీ వైసీపీ చేతిలో ఉంది. ఇక్కడ ఏ అభివృద్ధి పనిచేసినా టీడీపీ ఖాతాలో పడుతుందని భావించి 17 నెలలుగా వైసీపీ కౌన్సిల్ ఒక్క అభివృద్ధి పనికూడా జరగకుండా అడ్డుకుంటోంది. 18 మంది టీడీపీ కౌన్సిలర్లు ఉన్నా వైసీపీ చేస్తున్న అభివృద్ధి నిరోధక పరిపాలనను కౌన్సిల్లో దీటుగా ఎదుర్కోవడంలో విఫలం అయ్యారు. కనీసం ప్రజల్లో కూడా వైసీపీ వ్యవహారాన్ని ఎండగట్టే ప్రయత్నం చేయడం లేదు. దీంతో ఇక్కడ కమిషనర్, అధికారులు రాజకీయ ఆధిపత్య పోరులో నలిగిపోతున్నారు.

### రఫ్ అజెండాలో ప్రతిపాదించినా..

సాధారణంగా రఫ్ అజెండాలో వైసీపీ, టీడీపీ, ఎమ్మెల్యే, సాధారణ ప్రజలు, ప్రముఖులు మున్సిపల్ అధికారులు ప్రతిపాదించిన పనులు కమిషనర్ సంతకంతో తుది అజెండాలో చేరుస్తారు. కానీ వైసీపీ చైర్‌పర్సన్ భీమునిపల్లె లక్ష్మీదేవి కేవలం వైసీపీ కౌన్సిలర్లు ప్రతిపాదించిన పనులను మాత్రమే అజెండాలో పెడుతున్నారు. అక్టోబరులో 29 అంశాలు రఫ్ అజెండాలో పెడితే కేవలం 19 అంశాలు మాత్రమే వైసీపీ చైర్‌పర్సన్ అజెండాలో పెట్టారు. నవంబరులో 24 అంశాలు రఫ్ అజెండాలో పెడితే అందులో లేనివి కూడా పెట్టి 22 అంశాలు ఫేర్ అజెండాలో పెట్టారు. దీంతో కమిషనర్, మున్సిపల్ అధికారులు, టీడీపీ కౌన్సిలర్లు ప్రతిపాదించినవి ఏవీ అజెండాలోకి రావడం లేదు. ప్రతినెలా ఇలాగే సాగుతుండటంతో రెండు రోజుల క్రితం జరిగిన కౌన్సిల్ మీటింగ్‌ను మున్సిపల్ కమిషనర్ బాయ్‌కాట్ చేశారు. రఫ్ అజెండాలో పెట్టిన అంశాలు కాకుండా వేరే అంశాలు అజెండాలో రావడంతో చైర్‌పర్సన్ సీసీపై కమిషనర్ చర్యలు తీసుకున్నారు.

### రూ.5.25 కోట్ల పనులు అజెండాకు తీసుకురాని చైర్‌పర్సన్

కేంద్ర ప్రభుత్వం అందించే 15 ఆర్థిక సంఘం గ్రాంట్ నిధులు రూ.5.25 కోట్ల ప్రతిపాదిత పనులకు ఆమోదం తెలపడానికి అజెండాలో పెట్టాలని జూలై నెల నుంచి మున్సిపల్ కమిషనర్ రఫ్ అజెండాలో సంతకాలు పెట్టి ప్రతిపాదించినా.. వైసీపీ చైర్‌పర్సన్ ఇప్పటివరకు ఏ నెల అజెండాలోనూ చేర్చకుండా పక్కన పెడుతున్నారు. ప్రతిపాదనలే ఆమోదించకుంటే వాటికి టెండర్లు పిలిచి పనులు పూర్తిచేయడం సాధ్యపడదు. దీన్నిబట్టి ఈ పనులు జరిగితే టీడీపీ ఖాతాలోకి వెళతాయని వైసీపీ అడ్డుకుంటూ వస్తోందని స్పష్టం అవుతోంది.

### డిపాజిట్ వెనక్కి ఇవ్వకుండా వేధింపులు

తాత్కాలిక కూరగాయల మార్కెట్‌కు అధికారులు మార్చి 24న టెండర్లు నిర్వహించారు. మార్కెట్ అసోసియేషన్ వారే టెండరును అత్యధికంగా పాటపాడి దక్కించుకున్నారు. రూ.30 లక్షలు డిపాజిట్ అమౌంట్ కూడా మున్సిపాలిటీకి చెల్లించారు. అయితే వైసీపీ వైస్ చైర్మన్‌కు టెండరు దక్కలేదని చెప్పి ఆ కూరగాయల మార్కెట్ అంశం ఆమోదించకుండా చైర్‌పర్సన్ అడ్డుకున్నారు. తమ డిపాజిట్ రూ.30 లక్షలు వెనక్కి ఇవ్వమని మార్కెట్ అసోసియేషన్‌వారు అనేకమార్లు విన్నవించినా దీనిని అజెండాలో పెట్టకుండా వైసీపీ 8 నెలలుగా వేధిస్తోంది. కౌన్సిల్ ఆమోదిస్తే కానీ రూ.30 లక్షలు వెనక్కి ఇవ్వలేమని మున్సిపల్ కమిషనర్ చెబుతున్నారు. దీంతో వ్యాపారులు మున్సిపాలిటీ పరిపాలన తీరును తీవ్రంగా ఎండగడుతున్నారు. గత ఏడాది జూలై నుంచి ఇప్పటివరకు ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో వైసీపీ, టీడీపీ ఆధిపత్య పోరుతో ఏ ఒక్క అభివృద్ధి పనీ జరగడం లేదు. రూ.30 కోట్ల మేర 15 ఆర్థిక సంఘం నిధులు ఉన్నప్పటికి ప్రజాప్రతినిధుల తీరుతో అవి మురిగిపోతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఈ వ్యవహారానికి ముగింపు పలికి ప్రొద్దుటూరులో అభివృద్ధి పనులు జరిగేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

# ఆక్రమణలో కోనేటిగుంత

- ఏళ్ల తరబడి గుంతను పూడ్చక...
- సర్వే చేయక నిరుపయోగంగా..
- పట్టించుకోని రెవెన్యూ అధికారులు

చెన్నూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రుద్రభారతిపేటలోని కోనేటి గుంత రోగాలకు ఆక్రమణకు గురవుతోంది. చాలా ఏళ్లక్రితం ఈ గుంతలోని నీరు వ్యవసాయ పొలాలకు ఉపయోగపడేది. ఇదే ప్రాంతం పైభాగంలో ఉన్న రుద్రభారతిపేట చెరువు నుంచి నీరు వచ్చి కోనేటి గుంతకి చేరి.. అక్కడ నుంచి చిన్నమాచుపల్లె వ్యవసాయ పొలాలకు కాల్వల



కోనేటి గుంత స్థలాన్ని ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలు

**విలువ రూ2కోట్లు పైనే...**

రుద్రభారతి కోనేటి గుంతకు చుట్టూ ఉన్న స్థలం విలువ ప్రైవేటు మార్కెట్‌లో సెంటు రూ.3లక్షలు పైమాటే పలుకుతుంది. దీంతో ఈ స్థలం విలువ రూ.2 కోట్లు ఉంటుంది. సంబంధిత రెవెన్యూ అధికారులు స్పందించి ఆ కోనేటి గుంత స్థలానికి కొలతలు వేసి ఫెన్సింగ్ వేయడమా, లేక గుంత పూడ్చి ప్రజలకు ఇంటిపట్టాలు ఇవ్వడమా చేయాలని కోరుతున్నారు.

ద్వారా ఉపయోగపడేది. ఈక్రమంలో రుద్రభారతి పేట ప్రాంతంలో ప్రభుత్వం కొందరికి ఇంటిస్థలాలు కేటాయించింది. దీంతో 2002 నుంచి ఈ ప్రాంతంలో ఇంటి నిర్మాణాలు జరిగాయి. అయితే ఆ కోనేటి గుంత ( సర్వే నెం.138లో 75 సెంట్లుపైగా) లోతు ఎక్కువగా ఉందని దాన్ని వదిలేశారు. అయితే నాటి నుంచి నేటి వరకు గుంతలో నీరు వ్యవసాయ పొలాలకు వెళ్లే మార్గం లేక నిరుపయోగంగా మారింది. దీంతో కోనేటిలో పంట కాల్వ వ్యర్థాలు పడి దోమలకు నిలయంగా మారింది. దీంతో చీకటి పడితే దోమలు స్వైరవిహారం చేస్తున్నాయని ఆప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**కబ్జారాయుళ్ల కన్ను..**

ప్రభుత్వం 2006 నుంచి ఉపాధి హామీ పథకం ప్రవేశపెట్టడంతో పలు చోట్ల గుంతలను పూడ్చడం జరుగుతోంది. అదే విధంగా రుద్రభారతిపేట కోనేటి గుంతను కూడా పూడ్చిస్తే ప్రజలకు



రుద్రభారతిపేటలో నిరుపయోగంగా ఉన్న కోనేటి గుంత

ఉపయోగపడుతుందని పలువురు అంటున్నారు. చాలా కాలంగా రోడ్డు పక్కనే ఈ గుంత ఉండడంతో కొంతమంది కబ్జాదారుల కన్ను దీనిపై పడింది. గతంలో కోనేటి గుంత విస్తీర్ణం ఎక్కువగా ఉండేది. ప్రభుత్వం ఈ ప్రాంతంలో ఇంటి ప్లాట్లు కేటాయించడంతో కొందరు ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. దీంతో కోనేటి గుంత చుట్టూ ఉన్న స్థలాన్ని కొందరు ఆక్రమించుకుని నిర్మాణాలు చేపట్టారు. కోనేటి గుంత స్థలం కబ్జాకు గురవుతోందని.. సర్వే చేసి చుట్టూ ఫెన్సింగ్ వేయాలని చాల మంది రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఇంత వరకు ఆ గుంతను సర్వే చేసిన పాపానపోలేదు. దాదాపు 22 ఏళ్లుగా పట్టించుకునేవారే లేరు. దీంతో ఈ స్థలం మాదంటూ పోర్జరీ పట్టాలు తయారు చేసుకుని ఆక్రమించారు. ఇక కొందరు గుంత స్థలం మాది, మా పూర్వీకులది అంటూ తప్పుడు డాక్యుమెంట్లు చూపిస్తూ ఆక్రమించే ప్రయత్నం చేయడంతో ఇటీవల రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. కాగా, ఈ విషయమై తహశీల్దార్ సరస్వతిని వివరణ కోరగా.. కోనేటి గుంత విషయమై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని తెలిపారు.

## వసంతపేట పాఠశాలలో త్రీమెన్ కమిటీ విచారణ



విద్యార్థులను విచారిస్తున్న త్రీమెన్ కమిటీ సభ్యులు

ప్రొద్దుటూరుటౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక వసంతపేట మున్సిపల్ హైస్కూలులో నవంబరు 28వ తేదీ మధ్యాహ్న భోజనం ఫుడ్‌పాయిజన్ కావడంతో విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. ఈ సంఘటనపై ప్రభుత్వం విచారణకు ఆదేశించి త్రీమెన్ కమిటీ సభ్యులను నియమించింది. ఈ మేరకు కడప డిప్యూటీ డీఈవో రాజగోపాల్‌రెడ్డి, ఫుడ్‌ఇన్‌స్పెక్టర్ హరిత, తహసీల్దారు గంగయ్యను నియమించింది. మంగళవారం వారు అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందిన విద్యార్థులను విచారించారు. ఆరోజు జరిగిన సంఘటనపై వివరాలు తెలుసుకున్నారు. ఏం జరిగిందో లిఖితపూర్వకంగా రాసి ఇవ్వాలన్నారు. అలాగే ఆరోజు మధ్యాహ్న భోజనం రుచి చూసిన ఉపాధ్యాయులు, ఇతర ఉపాధ్యాయులను విచారించారు. అనంతరం పాఠశాలలో ఉన్న వంటగదిని పరిశీలించారు. బాత్‌రూం పక్కన ఉన్న వంట గదిని మరో చోటికి మార్చాలని సూచించారు. స్టోరూంను పరిశీలించి గాలి, వెలుతురు ఉండేటట్లు ఏర్పాటు చేయాలని ప్రధానోపాధ్యాయుడు గురప్పను ఆదేశించారు. ఈ విచారణకు వంట ఏజెన్సీ నిర్వాహకులు అందుబాటులోకి రాలేదని తెలిపారు. మధ్యాహ్న భోజన పథకం ఫుడ్‌పాయిజన్‌పై ఉన్నతాదికారులకు నివేదిక అందజేస్తామని డిప్యూటీ డీఈవో రాజగోపాల్‌రెడ్డి తెలిపారు.

## జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు పోట్లదుర్తి విద్యార్థిని



ఎర్రగుంట్ల, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోట్లదుర్తి ఉన్నత పాఠశాల విద్యార్థిని జి.అనుపమ రాష్ట్రస్థాయిలో జరిగిన అండర్-14 ఖోఖో పోటీల్లో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు శివరాం తెలిపారు. ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న అనుపమ గత నెల అనకాపల్లిలో జరిగిన రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో ప్రతిభ కనబరిచి జాతీయస్థాయికి ఎంపికయ్యిందన్నారు. జనవరిలో రాజస్థాన్‌లో జరగబోవు జాతీయ స్థాయి ఖోఖో పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. విద్యార్థిని ఎంపిక పట్ల ప్రధానోపాధ్యాయుడితో పాటు పీడీలు లక్ష్మి, సుధాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

## రాష్ట్రస్థాయి కౌశల్ సైన్స్ క్విజ్ పోటీలకు విద్యార్థి ఎంపిక



ప్రొద్దుటూరు టౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ఈనెల 27వ తేదీ జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో జరిగే రాష్ట్ర స్థాయి కౌశల్‌సైన్స్ క్విజ్ పోటీలకు స్థానిక ఎస్‌పీసీఎస్ రామేశ్వరం మున్సిపల్ పాఠశాల విద్యార్థి ఎంపికయ్యాడు. ఆ పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి ఎంజర్ల ప్రవీణ్‌రెడ్డి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. జిల్లాస్థాయి క్విజ్ పోటీల్లో ఆ విద్యార్థి ద్వితీయస్థానం సాధించడంతో రాష్ట్రస్థాయిపోటీలకు ఎంపిక చేశారు. ఎంపికైన విద్యార్థిని ప్రధానోపాధ్యాయుడు సత్యబాబు, ఉపాధ్యాయులు అభినందించారు.

## 21న విశాఖలో మిస్టర్ ఆంధ్ర బాడీబిల్డింగ్ పోటీలు

కడప స్పోర్ట్స్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్టణంలో ఈ నెల 21న మిస్టర్ ఆంధ్ర బాడీబిల్డింగ్ కాంపిటీషన్ పోటీలు జరగనున్నట్లు స్టేట్ బాడీబిల్డింగ్ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ న్యామతుల్లా వెల్లడించారు. మంగళవారం కడపలోని జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. న్యూ ఆంధ్ర బాడీ బిల్డింగు అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపడుతున్న పై పోటీల్లో ప్రతి ఒక్కరూ పాల్గొనేలా చూడాలని కోరారు. జిల్లా బాడీబిల్డింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు తారిక్‌ఆలీ, సెక్రటరీ అన్సర్‌ఆలీ ట్రెజరర్ ఇంతియాజ్‌ఖాన్ పాల్గొన్నారు.

## వివాహిత అదృశ్యం



ప్రొద్దుటూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు పట్టణం ఈశ్వర్‌రెడ్డినగర్‌కు చెందిన వద్ది సాయి రూప అనే వివాహిత అదృశ్యమైంది. వన్‌టౌన్ ఎస్ఐ సంజీవ రెడ్డి వివరాల మేరకు... వద్ది మధుసూదన్ సాయిరూపను 8 ఏళ్ల క్రితం ప్రేమవివాహం చేసుకున్నారు. ఆమె థైరాయిడ్ సమస్య కారణంగా పిల్లలు పుట్టలేదని బాధపడుతూ వుండేదని, డిసెంబరు 1న తెల్లవారు జామున ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. అప్పటి నుంచి కనబడుట లేదని వద్ది మధుసూదన్ ఫిర్యాదు చేశాడు ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

## అతిగా మద్యం తాగి వ్యక్తి మృతి

ప్రొద్దుటూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు పట్టణం గాంధీ రోడ్డులో సోమవారం రాత్రి అతిగా మద్యం తాగి ఓ వ్యక్తి అపస్మారక స్థితిలో పడిపోయాడు. స్థానికులు అంబులెన్సుకు ఫోన్ చేయడంతో అంబులెన్సు సిబ్బంది జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడు. ఆసుపత్రిలోని ఔట్ పోస్టు పోలీసులు అతని వివరాలపై ఆరా తీశారు. అతని జేబులో దొరికిన రేషన్‌కార్డు ఆధారం మేరకు మృతుని గౌస్ మోహిద్దీన్‌గా గుర్తించి.. అతని భార్య రేష్మకు సమాచారం అందించారు. తన భర్త ఆటో కొనుక్కోవాలని చెప్పి ఇంట్లో పదివేలు డబ్బులు తీసుకొని వెళ్లాడని, మద్యానికి బానిసై లివర్ కూడా దెబ్బతిందన్నారు. భార్య ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ ఎస్ఐ కేసు నమోదు చేశారు.

## కత్తితో దాడి.. ఒకరికి తీవ్ర గాయాలు

చిట్వేలి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కుడితినీళ్ల విషయంలో ఏర్పడిన వివాదంలో ఓ వ్యక్తి కత్తి పోట్లకు గురయ్యాడు. మండల పరిధిలోని నాగవరం గ్రామంలో మంగళవారం పశువులకు నీరు తాగించే తొట్టి వద్ద జగదాబి ప్రసాద్‌రాజు పవన్‌కుమార్‌రెడ్డి గొడవ పడ్డారు. దీంతో ఆగ్రహించిన ప్రసాద్ రాజు కత్తితో దాడి చేయడంతో పవన్‌కుమార్‌రెడ్డి కడుపులో తీవ్ర గాయాలై పేగులు బయటకు వచ్చాయి. క్షతగాత్రుడిని కుటుంబసభ్యులు కోడూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం తిరుపతిలోని రుయాకు తీసుకెళ్లారు. ఈ విషయమై కోడూరు రూరల్ సీఐ శ్రీనివాసులును వివరణ కోరగా విచారణ అనంతరం కేసు నమోదు చేస్తామన్నారు.

# నాణ్యతతో రుచికరంగా భోజనం అందించాలి

- సెంట్రలైజ్డ్ స్మార్ట్‌కిచెన్ల తనిఖీలో కలెక్టర్

జమ్మలమడుగు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ఎంతో ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తోందని.. విద్యార్థులకు నాణ్యతతో రుచికరమైన భోజనం అందించాలని వంట ఏజెన్సీలకు కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి సూచించారు. మంగళవారం జమ్మలమడుగు నియోజకవర్గ పర్యటనలో భాగంగా మొదట దేవగుడి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్మార్ట్‌కిచెన్ నిర్వహణ తీరును పరిశీలించి.. అక్కడున్న వంట ఏజెన్సీ సిబ్బందితో మాట్లాడారు. రోజువారి మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్నారా లేదా అని ఆరా తీశారు. భోజనం శుచిగా, రుచిగా అందిస్తున్నారా అంటూ ప్రశ్నించారు. అనంతరం జమ్మలమడుగు పట్టణంలోని పతంగే రామన్నరావు జిల్లా పరిషత్ హైస్కూలులో స్మార్ట్‌కిచెన్‌ను పరిశీలించి... వంట నిర్వహణ ఏజెన్సీలతో మాట్లాడారు. అన్నం, చెట్నీ రుచి చూసిన కలెక్టర్ మరింత నాణ్యతగా అందించాలని సూచించారు. స్టోర్‌రూములను, ఆర్వో ప్లాంట్లను పరిశీలించారు. నిర్వహణకు సంబంధించి ఏవైనా సమస్యలుంటే తెలియజేయాలని కోరారు. సేవా భావంతో పిల్లలకు భోజనం అందించాలని సూచించారు. రాష్ట్రానికే ఆదర్శంగా జిల్లాలో నిర్మిస్తున్న సెంట్రలైజ్డ్ స్మార్ట్‌కిచెన్లను జిల్లాలోని అన్ని మండలాల్లో ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో సాయిశ్రీ, తహసీల్దారు శ్రీనివాసరెడ్డి, హౌసింగ్ పీడీ రాజారత్నం, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



జమ్మలమడుగు పీఆర్ హైస్కూలులో భోజనం పరిశీలిస్తున్న కలెక్టర్

## మహిళా భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలి



జమ్మలమడుగు సబ్ డివిజనల్ పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎస్పీ నచికేత్ విశ్వనాథ్

కడప క్రైం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మహిళా భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ పేర్కొన్నారు. రౌడీషీటర్లు, ట్రబుల్ మాంగర్లు, గతంలో ఎన్నికల నేరాలకు పాల్పడిన వారి కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచాలని పోలీసు అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జమ్మలమడుగు సబ్ డివిజన్ పోలీసు అధికారులతో నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరించాలన్నారు. బాలికలు, మహిళల వేధింపులపై అవగాహన కల్పించాలన్నారు. గ్రామసభలు, పల్లెనిద్ర, గ్రామాల సందర్శన తప్పని సరిగా నిర్వహించాలన్నారు. డ్రోన్ కెమెరాల ద్వారా గంజాయి, ఇతర మత్తుపదార్థాలు, బహిరంగ మద్యపానం చేసేవారిపై దాడులు నిర్వహించి కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో రౌడీషీటర్లు, ట్రబుల్ మాంగర్లు, గతంలో నేరాలకు పాల్పడిన వారి కదలికలపై దృష్టి పెట్టాలన్నారు. శక్తిటీంలు పనితీరు మెరుగుపరచుకోవాలన్నారు. సమావేశంలో అడిషన్ ఎస్పీ కె.ప్రకాశ్‌బాబు, జమ్మలమడుగు డీఎస్పీ వెంకటేశ్వర్‌రావు, సబ్ డివిజనులోని సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

# డ్రాగా ముగిసిన క్రికెట్ మ్యాచ్‌లు

కడప స్పోర్ట్స్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కడపలో వివిధ జట్ల మధ్య జరుగుతున్న ఏసీఏ అండర్ 14 ఇంటర్ జోనల్ రెండు రోజుల క్రికెట్ మ్యాచ్‌లు డ్రాగా ముగిశాయి. వివరాలిలా... కేఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో నార్త్‌జోన్‌విన్నర్స్-సెంట్రల్ జోన్ విన్నర్స్ జట్ల మధ్య సాగిన మ్యాచ్‌లో మొదటి ఇన్నింగ్స్‌లో నార్త్‌జోన్ విన్నర్స్ జట్టు 90 ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి 272 పరుగులు చేసింది. అనంతరం సెంట్రల్ జోన్ విన్నర్స్ జట్టు రెండో రోజు 90 ఓవర్లలో ఆట ముగిసే సమయానికి ఐదు వికెట్లు కోల్పోయి 291 పరుగులు చేసింది. ఇందులో తమన్‌సాయి 111 పరుగులు చేసి నాటౌట్‌గా క్రీజ్‌లో నిలిచారు. దీంతో సెంట్రల్ జోన్ జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 20 పరుగుల ఆధిక్యత సాధించింది. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది.

కేఓఆర్ఎం మైదానంలో సౌత్‌జోన్ - రెస్ట్ ఆఫ్ నార్త్ జోన్ మధ్య జరిగిన మ్యాచ్‌లో రెస్ట్‌ఆఫ్ సౌత్‌జోన్ జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 69.5 ఓవర్లలో 181 పరుగులకు ఆలౌట్ అయ్యింది. అనంతరం బ్యాటింగ్ దిగిన రెస్ట్‌ఆఫ్ నార్త్ జోన్ జట్టు మొదటిరోజు ఆట ముగిసే సమయానికి రెండు వికెట్లు కోల్పోయి 62 పరుగులు చేసింది. మంగళవారం తిరిగి బ్యాటింగ్ చేపట్టి 63.5 ఓవర్లలో 197 పరుగులు చేసి ఆలౌట్ అయింది. కాగా బౌలింగ్ విభాగంలో రెస్ట్ ఆఫ్ సౌత్‌జోన్ బౌలరు రోహిత్ ఆరు వికెట్లు పడగొట్టడం విశేషం. అనంతరం రెండో ఇన్నింగ్స్‌కు బ్యాటింగ్ దిగిన రెస్ట్ ఆఫ్ సౌత్ జోన్ జట్టు ఆట ముగిసే సమయానికి 97 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 158 పరుగులు చేసింది. దీంతో మ్యాచ్‌ను డ్రాగా ముగిసినట్లు వెల్లడించారు.

ఏసీఏ క్రికెట్ మైదానంలో వెస్ట్ ఆఫ్ సెంట్రల్ జోన్ - సౌత్ జోన్ విన్నర్స్ జట్ల మధ్య సాగిన మరో మ్యాచ్‌లో సౌత్‌జోన్ విన్నర్స్ జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 76 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 193 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. అనంతరం రెండోరోజు బ్యాటింగ్‌కు దిగిన రెస్ట్‌ఆఫ్ సెంట్రల్ జోన్ జట్టు 78 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 303 పరుగులు చేసింది. ఇందులో రాజ్ 129 పరుగులు చేశారు. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసినట్లు వెల్లడించారు.



తమన్‌సాయి, రోహిత్, రాజ్

# భూఆక్రమణలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు

కలసపాడు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూ ఆక్రమణలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని బద్వేలు ఆర్డీఓ చంద్రమోహన్ హెచ్చరించారు. మంగళవారం ఆయన కలసపాడు మండలంలో పర్యటించారు. బ్రాహ్మణపల్లె గ్రామానికి చెందిన రైతు వెంకటరమణ ఆత్మహత్యపై స్థానికులు, పోలీసులు, రెవెన్యూ, వ్యవసాయ సిబ్బందితో కలిసి విచారణ జరిపారు. కలసపాడులోని సర్వేనెంబర్ 240లోని స్థలాన్ని పరిశీలించారు. రెండు రోజుల పాటు జరిగే గుడి తిరుణాళ ఏర్పాట్లను పరిశీలించారు. తహసీల్దారు కార్యాలయంలో చెన్నుపల్లె భూములపై చర్చించారు. ఇటీవల ఆక్రమణలకు గురవుతున్న శంఖవరం రెవెన్యూ పరిధిలోని 2707 సర్వే నెంబర్ భూములను ఆయన పరిశీలించి ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని స్థానిక రెవిన్యూ సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట పోరుమామిళ్ల సీఐ హేమసుందర్, తహసీల్దార్ మధురవాణి, డీటీ మోహన్‌రాజు, ఆర్ఐ సింధూజ, ఎస్ఐ తిమోతి, వ్యవసాయశాఖ అధికారులు, ఫారెస్ట్ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

**జాతీయ రహదారి పనుల పరిశీలన**

పోరుమామిళ్ల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): అమరావతి - బెంగుళూరు ఆరు లేన్ల రహదారి పనులను బద్వేలు ఆర్డీవో చంద్రమోహన్ పరిశీలించారు. మంగళవారం ఆయన పోరుమామిళ్ల మండలంలోని సంచర్ల గ్రామంలో భూ విషయమై పరిశీలించారు. అనంతరం చెన్నారెడ్డిపేట సమీపంలో ఆరు లేన్ల రహదారికి సంబంధించి రహదారి నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా కొందరు తమకు ఇంకా నష్టపరిహారం అందలేదనే విషయం ఆయన దృష్టికి తెచ్చారు. పరిశీలించి భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం అందేలా చూస్తామన్నారు. ఈ జాతీయ రహదారి నిర్మాణానికి సంబంధించి ఇంకా 30 మంది రైతులకు నష్టపరిహారం అందాల్సి ఉంది. కార్యక్రమంలో తహసీల్దారు చంద్రశేఖర్‌రెడ్డి రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



ఆక్రమిత భూములను పరిశీలిస్తున్న ఆర్డీఓ చంద్రమోహన్

# అనుమతి లేకుండా నిర్మాణాలు చేపడితే చర్యలు : డీఎస్పీ





మైనార్టీ నేతలతో మాట్లాడుతున్న పోలీసులు, నిర్మాణంలో ఉన్న గదులకు నోటీసులు అంటిస్తున్న పంచాయతీ సిబ్బంది

చెన్నూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ పరిధిలో ఎటువంటి నిర్మాణాలైన అనుమతి లేకుండా చేపడితే చట్టపరంగా చర్యలు తప్పవని కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. చెన్నూరు ఖిల్లా మసీదు ఆవరణలో గత కొద్దిరోజులుగా రూముల నిర్మాణాలు చేపడు తున్నారు. దీనిపై గతంలో ఇక్కడ పంచాయతీ అనుమతులు లేవని నోటీసులు ఇచ్చి నిలిపి వేశారు. ఈ విషయమై గత కొద్దినెలలుగా అటు పంచాయతీ, ఇటు పోలీసులు, మైనార్టీ నేతల మధ్య చర్చలు జరుగుతున్నాయి. అయితే మంగళవారం తిరిగి అదే గదులకు పైకప్పు వేసేందుకు మైనార్టీ నేతలు ప్రయత్నించారు. ఈ విషయం పంచాయతీ అధికారులకు తెలియడంతో వారు పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో డీఎస్పీ ఆదేశాల మేరకు సీఐ క్రిష్ణారెడ్డి, కమలాపురం సీఐ రోషన్, కడప, సీకేదిన్నె, వల్లూరు ఎస్ఐలు తులసి నాగప్రసాద్, శ్రీనివాసులరెడ్డి, పెద్ద ఓబన్నలు మసీదు వద్దకు వచ్చి నిర్మాణ పనులను అడ్డుకున్నారు. దీంతో మైనార్టీ నేతలు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. మసీదు స్థలంలో కట్టుకోవడానికి తమకు హక్కు ఉందని.. దీంట్లో ఎవరి ప్రమేయం అవసరం లేదన్నారు. ఇందుకు పోలీసులు ఇప్పటికే ఈ పంచాయతీ కలెక్టరు, ఎస్పీ దృష్టిలో ఉందని, ఆర్డీవో అనుమతి తీసుకున్న తరువాతే నిర్మాణాలు చేపట్టాలన్నారు. ఒక దశలో ఈ విషయం కాస్త శ్రుతి మీరడంతో పోలీసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పంచాయతీ అధికారుల అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని, ఇష్టానుసారం నిర్మాణాలు చేపడితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం పంచాయతీ సిబ్బంది నిర్మాణాలు చేపడు తున్న గదులకు నోటీసులు అంటించారు. అనుమతి ఉంటేనే నిర్మాణాలు చేపట్టాలంటూ నోటీసుల్లో పేర్కొన్నారు.

## ఘనంగా రాహుకాల పూజలు



కడప కల్చరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నగర బిల్టప్ సమీపంలోని విజయదుర్గాదేవి ఆలయంలో మంగళవారం ఘనంగా రాహుకాల పూజలు నిర్వహించారు. అమ్మవారి సన్నిధిలో నిమ్మకాయలతో కూడిన రాహుకాలదీపాలు వెలిగించారు. జిల్లా నలుమూలల నుంచే కాక రాయలసీమ వ్యాప్తంగా ఉన్న జిల్లాల నుంచి పెద్దఎత్తున మహిళా భక్తులు మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 4.30గంటల వరకు అమ్మవారి ఆలయంలో రాహుకేతు పూజలు చేశారు. ఇదిలా ఉండగా ఈ నెల 4వతేదీ గురువారం పౌర్ణమి సందర్భంగా అమ్మవారికి తెల్లవారుజామున 4గంటలకు నవకలశ స్నపనం ( విశేష అభిషేకం) 10గంటల నుంచి హోమం, సాయంత్రం 6గంటలకు 108 దీపాలతో అష్టోత్తర దీపాలంకార సేవ నిర్వహిస్తారని ఆలయ వ్యవస్థాపకుడు మల్లికార్జున తెలిపారు.

## బాలోత్సవంలో చైతన్య విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ చూపిన విద్యార్థులతో కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి

వేంపల్లె, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కడప మరియాపురంలోని సెయింట్ జోసెఫ్‌బాలికల పాఠశాలలో నవంబరు ఆఖరులో జరిగిన జిల్లాస్థాయి బాలోత్సవం పోటీల్లో వేంపల్లె చైతన్య హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈ పోటీల్లో చైతన్య హైస్కూల్ నుంచి 120 మంది విద్యార్థులు 24 విభాగాల్లో పోటీ చేయగా 20 విభాగాల్లో మంచి ప్రతిభ కనబరిచారు. సైన్స్ ఎగ్జిబిషన్, డ్రాయింగ్, దేశభక్తి గీతాలు, మట్టితో బొమ్మలు తయారు, కథలు చెప్పడం, పద్యాలు పాడడం, క్లాసికల్ డ్యాన్స్, వ్యాసరచన పోటీలు, కార్టూన్, డ్రాయింగ్, మెమెరీ టెస్టు తదితర పలు విభాగాల్లో ప్రతిభ చూపారని కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల్లో కూడా రాణించాలని ఆయన ఆకాంక్షించారు.

## ప్రతి ఎకరాకు సాగు, తాగునీరు అందిస్తాం

వీరపునాయునిపల్లె, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సర్వరాయసాగర్ ద్వారా ప్రతి ఎకరాకు సాగు, ప్రజలకు తాగునీరు అదిస్తామని కమలాపురం ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి అన్నారు. మంగళవారం అనిమెల గ్రామంలో ప్రభుత్వం 40శాతం సబ్సిడీతో అందిస్తున్న వేరుశనగ విత్తన పంపిణీ కార్యక్రమంలో భాగంగా ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న సర్వరాయసాగర్ పిల్లకాల్వల పనులను ఏడాదిలోపు పూర్తిచేయించి 25వేల ఎకరాలకు సాగు, తాగునీరు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ కన్వీనర్ బైరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ నర్రెడ్డి ప్రసాదరెడ్డి, సంగమేశ్వర ఆలయంచైర్మన్ మురళీమోహన్‌రెడ్డి, వ్యవసాయ సంచాలకుడు నరసింహారెడ్డి, ఏఓ శ్యామ్‌బాబు, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు. కాగా వీరపునాయునిపల్లె టీడీపీ కార్యాలయంలో ప్రజా దర్బార్ కార్యక్రమానికి కమలాపురం ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు.

## దోమ పుట్టరాదు-దోమ కుట్టరాదు



మాట్లాడుతున్న డాక్టర్ ఖాజామొద్దీన్

వేముల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): దోమ పుట్టరాదు - దోమ కుట్టరాదని జిల్లా ఉప వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఖాజామొద్దీన్ అన్నారు. మంగళవారం స్థానిక పీహెచ్‌ఈలో ఆశా మీటింగ్‌ను ఆయన అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు పడుతున్నందున ప్రజలు నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, తొట్లనీటి డ్రమ్ములు, నీరునిల్వ ఉంచుకునే ఇతర పాత్రలపై మూతలు ఉంచాలన్నారు. ఒక దోమ ఒక్కసారికి వంద నుంచి రెండు,మూడు వందల వరకు గుడ్లు పెడతుందన్నారు. దోమను లార్వా దశలోనే అంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ శరణయ్య, డాక్టర్ ఆఫ్రిన్, సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య, సీహెచ్‌ఓ అరుణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## 'జిల్లాలో విచ్చలవిడిగా లింగ నిర్ధారణ పరీక్షలు'

కడపసెవెన్ రోడ్స్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రైవేట్ ఆసుపత్రులు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా విచ్చలవిడిగా లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నారని, వాటిపై తనిఖీలునిర్వహించి చర్యలు తీసుకోవడంలో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ తెలిపారు. మంగళవారం జిల్లా కార్యాలయంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో నాయకులు నిర్మల్, రాజు పాల్గొన్నారు.



# ఇలా ఉంటే ప్రమాదాలు జరగవా..?



వేంపల్లె పట్టణం గాంధీరోడ్డులో ప్రమాదకరంగా ఉన్న సిమెంటు రోడ్డుపై వేస్టేజీ కుప్ప

వేంపల్లె, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె మేజర్ పంచాయతీ పరిధిలోని గాంధీరోడ్డులో ఒకవైపు కొళాయి కనెక్షన్‌లకు గుంతలు తీశారు, మరోవైపు మెగాకంపెనీ ఆధ్వర్యంలో పైప్‌లైన్ ఏర్పాటుకు గాడి తవ్వారు. గాడి తీసిన సమయంలో వచ్చిన వేస్టేజీని కుప్పలుగా రోడ్డుపైనే ఉంచారు. దీనితో రాత్రి వేళల్లో ద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. కొళాయి కనెక్షన్ కోసం గోతులు తవ్వాక పూర్తిస్థాయిలో చదునుచేయకపోవడంపై స్థానిక ప్రజలు ప్రశ్నిస్తున్నారు. మెగా కంపెనీ ద్వారా వచ్చిన సిమెంటు వేస్టేజీని కుప్పగా ఏర్పాటుచేశారు. వాటిని ఎవరు తొలగిస్తారు సదరు కాంట్రాక్టర్ పట్టించుకోకపోవడం శోచనీయమని స్థానికులు చర్చించుకుంటున్నారు. ఇలాంటి వాటిపై వెంటనే స్పందిచకపోతే మరిన్ని ప్రమాదాలు జరుగుతాయని, ఇప్పటికైన సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

# చలో ఢిల్లీ కార్యక్రమానికి బీసీలు తరలిరండి

- జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వెంగళరావు



మాట్లాడుతున్న జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వెంగళరావు

కడప మారుతీనగర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): చట్టసభల్లో బీసీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 16న ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద తలపెట్టిన నిరసన కార్యక్రమానికి రాయలసీమ వ్యాప్తంగా ఉన్న బీసీలు తరలిరావాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు లాకా వెంగళరావు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జనాభాలో 60 శాతానికి పైగా ఉన్న బీసీలు అన్నిరంగాల్లో వెనుకబడేఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజ ర్వేషన్లు కల్పించాలన్నారు. అలాగే నామినేటెడ్ పదవుల్లో బీసీలకు సముచిత స్థానం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు చంద్రమౌళి, శివాయాదవ్, బంగారు నాగయ్యయాదవ్ పలువురు బీసీలు పాల్గొన్నారు.

### పాఠశాల వ్యవస్థాపకుడికి ఉపాధ్యాయుల నివాళి

పులివెందుల టౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉన్నతపాఠశాల వ్యవస్థాపకుడు దొరస్వామినాయుడుకు పాఠశాల ఉపాధ్యాయులు నివాళుర్పించారు. ప్రభుత్వ ఉన్నత (మెయిన్) పాఠశాలను దొరస్వామినాయుడు స్థాపించారని ఉపాధ్యాయులు కొనియాడారు. దొరస్వామినాయుడు 1926 డిసెంబరు 1వ తేదీన స్వర్గస్థులయ్యారని వారు గుర్తుచేసుకున్నారు. బ్రిటీష్‌పాలనలో పులివెందుల ప్రాంతంలో చదువు లేక వెనుకబడి పోతున్న ప్రాంతాన్ని చూసి ఆయన ఉన్నత పాఠశాలను ఏర్పాటుచేశారని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. చిత్తూరు జిల్లాకు చెందిన దొరస్వామినాయుడు తనస్నేహితుల ద్వారా పులివెందులలో స్థిరపడ్డారన్నారు. ఆయన వర్ధంతి సందర్భంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

## కేసుల పరిష్కారంలో అలసత్వం వద్దు

డీఎస్పీ వెంకటేశ్వర్లు



రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

కమలాపురం రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కేసులు పరిష్కరించడంలో అలసత్వం వహించవద్దని డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం స్థానిక పోలీసుస్టేషన్‌ను డీఎస్పీ ఆకస్మిక తనిఖీ చేశారు. స్టేషన్‌లోని పలు రికార్డులు, పరిసరాలు పరిశీలించి పెండింగులో ఉన్న కేసులో పురోగతి వివరాలు సిబ్బంది ద్వారా తెలుసుకున్నారు. సీఐ రోషన్, ఎస్ఐ విద్యాసాగర్ స్టేషన్ పరిధికి సంబంధించి కేసుల వివరాలను డీఎస్పీకి తెలిపారు. కార్యక్రమంలో కమలాపురం పోలీసులు సిబ్బంది పాల్గొన్నారు.

## మహిళల రక్షణకే శక్తియాప్



మహిళలకు అవగాహన కల్పిస్తున్న సీఐ బాలమద్దిలేటి

సీకేదిన్నె, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మహిళల రక్షణ కోసం ప్రత్యేకంగా ప్రభుత్వం శక్తియాప్‌ను ప్రవేశపెట్టడం జరిగిందని చింతకొమ్మదిన్నె సీఐ బాలమద్దిలేటి తెలిపారు. మండలంలోని రోడ్డు క్రిష్ణాపురంలోని వర్కింగ్ ఉమెన్స్ హాస్టలులో శక్తియాప్‌పై మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఈ యాప్‌ను ఉపయోగించుకుని ఎటువంటి ఆపద సమయంలోనైనా ఎస్ఎంఎస్ బటన్‌తో డయల్ 112 ద్వారా సమాచారం అందిస్తే పది నిమిషాల్లో ఘటనా స్థలానికి చేరుకుని పోలీసులు రక్షణ కల్పిస్తారన్నారు. అత్యవసర సమయంలో డయల్ 100, 112 నంబర్లకు, చైల్డ్‌లైన్‌కు 1098కు , గృహహింసకు 181కు, మహిళల వేదింపులు 1091, సైబర్ నేరాల టోల్ ఫ్రీ 1930కు ఫోన్ చేసి తక్షణ సహాయం పొందాలన్నారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ రామక్రిష్ణ పాల్గొన్నారు.

## 10న రాష్ట్ర వ్యాప్త ఆందోళన

సీపీఐ

కడప సెవెన్‌రోడ్స్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రైతాంగ సమస్యలపై డిసెంబరు 10న రాష్ట్ర వ్యాప్త ఆందోళన నిర్వహిస్తున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం చేయాలని, రైతుల పట్ల కూటమి ప్రభుత్వ వైఖరికి నిరసనగా సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టినట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్త ఆందోళనలో భాగంగా జిల్లాలో అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో ఆందోళన చేయాలని మంగళవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర పిలుపునిచ్చారు.

## మహాసభలను జయప్రదం చేయండి

కడప నాగరాజుపేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయాలని మంగళవారం కడపనగరంలోని ప్రకాష్ నగర్ బాలుర సంక్షేమ హాస్టల్ లో గోడపత్రికలు విడుదల చేశారు. కడప నగర అధ్యక్షుడు జాలా సుమంత్ మాట్లాడుతూ తిరుపతిలో డిసెంబరు 12,13,14 తేదీలలో నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

### స్థిరమైన ఆదాయానికి సుస్థిరాభివృద్ధే ముఖ్యం

చెన్నూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయితీలు స్థిరమైన ఆదాయం సంపాదించాలంటే సుస్థిరాభివృద్ధే సాధ్యమని ఎంపీడీఓ కిరణ్ మోహన్‌రావు అన్నారు. ఎంపీడీవో సభా భవనంలో మంగళవారం వల్లూరు, ఖాజీపేట మండలాల సర్పంచ్‌లు, కార్యదర్శులకు సుస్థిరాభివృద్ధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ చీర్ల సురేశ్‌యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీలు ఆదాయ వనరులను పెంచుకునే దిశగా ప్రభుత్వం ఎన్నో అవగాహన కార్యక్రమాలు వారికి కల్పిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో గురువేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమ హాస్టళ్లు ఆదర్శంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి

పులివెందుల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పులివెందులలోని సంక్షేమ హాసళ్ల ఆదర్శంగా ఉండాలని ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఆర్అండ్ బీ బంగళాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టళ్ల వార్డన్లతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం సంక్షేమ హాస్టళ్ల విషయంలో ఎంతో చిత్తశుద్ధితో ఉందన్నారు. హాస్టళ్లలో జరుగుతున్న తప్పులను సరిదిద్దుకోవాలన్నారు. విద్యార్థుల సంక్షేమం విషయంలో ఎక్కడా రాజీ లేదన్నారు. అన్ని హాస్టళ్లలో వచ్చిన సమస్యలను ఒక్కొక్క హాస్టల్ వార్డన్‌తో పరిష్కారానికి చర్యలు తీసుకుంటానన్నారు. విద్యార్థులకు అందించే మెనూ సక్రమంగా అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డన్లు తదతరులుపాల్గొన్నారు.

### ఆడ, మగ ఇద్దరూ సమానమే

వేముల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఇంట్లో ఆడ, మగ ఇద్దరూ సమానమే అనే భావనతో తల్లిదండ్రులు పెంచాలని వెలుగు ఏపీఎం ఆంజనేయులు పేర్కొన్నారు. మంగళవారం వి.కొత్తపల్లెలో డ్వాక్రా మహిళలతో లింగ వివక్ష వ్యతిరేక అవగాహన జెండర్ క్యాంపెయిన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీసీ నాగేశ్వరి, గ్రామ సమాఖ్య అసిస్టెంట్లు గంగాభవాని, లత, లక్ష్మీదేవి తదితరులుపాల్గొన్నారు.

## విద్యావలంటీర్లకు దరఖాస్తుల ఆహ్వానం

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాశాఖ, సమగ్ర శిక్ష సంయుక్త ఆధ్వర్యంలో కడప మండలం పరిధిలోని పాఠశాలలో విద్య వలంటీర్లుగా పనిచేసేందుకు అర్హత గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కడప మండల విద్యాశాఖ అధికారి రఫీక్ అహమద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 5వ తేదీలోగా దరఖాస్తులను మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో అందజేయాలన్నారు. ఇతర వివరాలకు మండల వనరుల కేంద్రం కాగితాలపెంట కడప కార్యాలయాన్ని సంప్రదించాలనికోరారు.

**ఖాళీలు..:** ఎస్జీటీలకు సంబంధించి ఉర్దూ 3, తెలుగు 1 పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. అలాగే స్కూల్ అసిస్టెంట్లకు సంబంధించి ఉర్దూ 3, తెలుగు 4, ఇంగ్లీష్ 3, ఫిజికల్ సైన్స్ 1, బయాలజీ 2, సోషల్ స్టడీస్ 1, బయాలజీ ఉర్దూ 1, గణితం ఉర్దూ 1, సోషల్ స్టడీస్ ఉర్దూ 1 ఖాళీలు ఉన్నట్లు తెలిపారు.

### ప్రతి కార్యకర్తకు అండగా ఉంటా

ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి



చెక్కునందిస్తున్న ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి

వల్లూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): టీడీపీ అంటేనే కార్యకర్త అని, కార్యకర్త అంటే టీడీపీ అని ఎమ్మెల్యే క్రిష్ణ చైతన్యరెడ్డి అన్నారు. మండల పరిధిలోని కోట్లూరు పంచాయతీలో బీచువారి పల్లెకు చెందిన ఇరగన బోయిన రామ్మోహన్ యాదవ్ యాక్సిడెంటులో మృతి చెందాడు. ఇతను టీడీపీలో సభ్యత్వం ఉండడంతో అతను మృతి చెందిన వెంటనే ఎమ్మెల్యే చొరవ తీసుకుని పార్టీ దృష్టికి తీసుకెళ్లి రూ.5లక్షలు ఎక్స్‌గ్రేషియా తీసుకురావడంలో కృషి చేశారు. దీంతో ఆయన చెక్కును మంగళవారం మృతుని భార్యకు చెక్కును అందించారు. కార్యక్రమంలో వల్లూరు టీడీపీ అధ్యక్షుడు, సొసైటీ ఛైర్మన్ లేబాక నాగేశ్వర్‌రెడ్డి, స్థానిక నేతలుక్రిష్ణారెడ్డి, హరిక్రిష్ణయాదవ్, శంకరరెడ్డి, ఓబులేసుయాదవ్ పాల్గొన్నారు.

## నేడు గండి క్షేత్రంలో హనుమత్ వ్రతం

చక్రాయపేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): గండి క్షేత్రంలో బుధవారం ఉదయం హనుమత్ వ్రతం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పంబా నది కలశ ఆవాహన, పుణ్యాఃవాచనం, హనుమత్ వ్రత కథలు,మన్యసూక్త, పంచసూక్త, సుదర్శన,నరసింహ, పంచముఖ హనుమాన్ హోమం, సిందూర అర్చన, నాగవల్లి దళంతో తమలపాకులు సహస్రనామం, పూర్ణాహుతి, శాత్తుముర్రై, మహామంగళ హారతి, తీర్థప్రసాదవినియోగం ఉంటుందన్నారు. భక్తులందరూ హోమాల్లో పాల్గొనేందుకు ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. పూజలో పాల్గొనదలచిన భక్తులు సాంప్రదాయ దుస్తులతో రావాలన్నారు. హోమానికి, పసుపు,కుంకుమ,తమలపాకులు,వక్కలు, ఎండు కొబ్బెర గిన్నె,నెయ్యి ప్యాకెట్,పసుపు కొమ్ములు, ఎండు ఖర్జూరం, పసుపు (లేక) ఎరుపు రంగు గల జాకెట్ పీస్ అన్ని తీసుకువచ్చి స్వామివారి మహా పూర్ణాహుతిలో సమర్పించుటకు భక్తులందరికీ అవకాశం ఉందన్నారు. ప్రతి ఒక్కరు స్వామి వారి హోమంలో పాల్గొని కృపాకటాక్షాలకు పాత్రులు కావాలనికోరారు.

## ఎస్జీటీ ఖాళీలన్నీ భర్తీ చేయాలి

డీఈఓకు యూటీఎఫ్ వినతి



డీఈఓకు వినతిపత్రం సమర్పిస్తున్న యూటీఎఫ్ ప్రతినిధులు

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఎస్జీటీ ఖాళీలన్నింటినీ వెంటనే భర్తీ చేయాలని యూటీఎఫ్ శాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్‌బాబు డిమాండ్ చేశారు. మంగళవారం కడప నగరం డీఈఓ కార్యాలయంలో డీఈఓ డాక్టర్ షంషుద్దీన్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళన మార్గాన్ని అనుస రించలసి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నరసింహారావు, ఏజాస్ అహ్మద్, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### సూపర్‌సిక్స్ హామీలు పూర్తిస్థాయిలో అమలు చేయాలి

తులసిరెడ్డి

వేంపల్లె, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సూపర్ సిక్స్ హామీలు పూర్తిస్థాయిలో అమలు చేయాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని మంగళవారం ఆయన ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎన్నికల సందర్భంగా కూటమి పార్టీలు ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలలో ప్రధానమైన నిరుద్యోగ భృతి అన్నారు. 19-59 సంవత్స రాల మధ్య వయసులో ఉన్న ప్రతి ఆడ బిడ్డకు నెలకు రూ. 1500 ఆర్థికసహాయం చేస్తామని సూపర్‌సిక్స్ హామీలలో చెప్పారన్నారు. ఎస్సీ,ఎస్టీ, బీసీ, ముస్లిం మైనార్టీలకు 50ఏళ్లకు పింఛన్ ఇస్తామన్నారు. జనవరి 1 నుంచి పథకాలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.



### రహదారి భద్రతా నియమాలపై అవగాహన

కడప క్రైం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రామక్రిష్ణమఠం స్కూలులో రిమ్స్ ఎస్ఐ సుభాశ్‌చంద్రబోస్ మంగళవారం విద్యార్థులకు రహదారి భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. సమాజంలో జరిగే నేరాలు, మాదక ద్రవ్యాల వినియోగం వల్ల జరిగే నష్టాలు, సైబర్ మోసాలు, రహదారి భద్రతా నియమాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రగ్స్ వద్దు బ్రో.. కార్యక్రమాన్ని ఈగల్ టీం, నార్కోటిక్ టీం, డిస్ట్రిక్ట్ డీ అడిక్షన్ సెంటరు ఆధ్వర్యంలో డ్రగ్స్ గురించి విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏవైనా సంఘటనలు ఎదురైతే 112, 1930కు సమాచారం అందించాలన్నారు.



మాట్లాడుతున్న రిమ్స్ ఎస్ఐ సుభాశ్‌చంద్రబోస్

# డ్రోన్ కెమెరాలతో జల్లెడ పడుతున్న పోలీసు అధికారులు

కడప క్రైం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): గంజాయి, అసాంఘిక కార్యలకాపాలు, బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం తాగే వారిపై కఠిన చర్యలకు పోలీసు అధికారులు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగిస్తున్నారు. మంగళవారం కడపనగరం వన్‌టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో గంజాయి , బహిరంగ మద్యపానం చేసే అవకాశాలు ఉన్న ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాల సాయంతో నిఘా ఉంచేలా చర్యలు చేపట్టారు. కడప వన్‌టౌన్ సీఐ చిన్నపెద్దయ్య ఆధ్వర్యంలో ఎస్ఐ అమర్‌నాథరెడ్డి, స్పెషల్ పార్టీ సిబ్బంది కలిసి ఆయా ప్రాంతాలను జల్లెడ పట్టారు. నగరంలోని బిస్మిల్లానగర్, గౌస్‌నగర్, సాయిపేట, నకాశ్, దేవుని కడప, చెరువు కట్ట ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాలతో నిఘా ఉంచడం ద్వారా అనుమానితులను గుర్తించే చర్యలు చేపట్టారు.



డ్రోన్ కెమెరాలతో పరిశీలిస్తున్న దృశ్యం




# రిజర్వాయర్లలో సమృద్ధిగా నీరు : ఎమ్మెల్యే

దువ్వూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): తెలుగుగంగ రిజర్వాయర్లలో సమృద్ధిగా నీరు నిలువ ఉంచామని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ అన్నారు. మండలంలోని చల్లబసాయిపల్లె సమీపంలో సబ్సిడరీ రిజర్వాయర్-1ను మంగళవారం ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా తెలుగుగంగ నీటికి జలహారతి ఇచ్చారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఎస్‌ఆర్-1, ఎస్‌ఆర్-2తో పాటు బ్రహ్మంసాగర్‌లో ఎప్పుడూ లేనంత నీరు ప్రస్తుతం నిలువ ఉంచామని తెలిపారు. జిల్లాలో దాదాపు 30 టీఎంసీల నీరు తెలుగుగంగకు ఈ సంవత్సరం చేరిందని చెప్పారు. వర్షాలు పడకున్నా రెండేళ్లపాటు తాగునీటి అవసరాలకు ఇబ్బంది ఉండదన్నారు. తెలుగుగంగ ఎస్‌ఈ, డీఈ, ఏఈ, జేఈతో పాటు మండల కన్వీనర్ వెంకటరమణారెడ్డి, ప్రతాప్ నాయుడు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**బాధిత కుటుంబానికి ప్రభుత్వ సాయం**

మండలంలోని గుడిపాడు గ్రామంలో మార్తల గురివిరెడ్డి కుటుంబానికి మంగళవారం ఎమ్మెల్యే సుధాకర్‌యాదవ్ ప్రభుత్వం మంజూరు చేసిన ఆర్థికసాయం అందజేశారు. ఇటీవల గురివిరెడ్డి రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. అంతకుముందు టీడీపీ సభ్యత్వం తీసుకుని ఉండడంతో ఈ వ్యక్తి కుటుంబానికి రూ.5 లక్షలు మంజూరైంది. మండల కన్వీనర్ బోరెడ్డి వెంకటరమణారెడ్డి, మండల టీడీపీ నాయకులు, అధికారులు, పాల్గొన్నారు.

**సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ**

మైదుకూరు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గానికి చెందిన 31 మంది బాధిత కుటుంబాలకు మంగళవారం


సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేస్తున్న పుట్టా

ఎమ్మెల్యే సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేశారు. ప్రొద్దుటూరులోని తన క్యాంపు ఆఫీసులో రూ.24,22,100 చెక్కులను అందించారు. కార్యక్రమంలో అన్ని మండలాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

**శ్మశానవాటిక ప్రారంభం**

మండల పరిధిలోని డయాన్‌ఖాన్‌పల్లెలో నిర్మించిన శ్మశానవాటికను మంగళవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధుల ద్వారా రూ.20 లక్షల వ్యయంతో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ వారు ఏర్పాటు చేశారని, రాష్ట్ర వ్యాప్తంగా క్రిమిటోరియం నిధులతో ఏర్పాటు చేసిన మొట్టమొదటి శ్మశానవాటిక ఇదే అన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు రాజసింహ నరేంద్ర, ఎండీఓ శ్రీధర్‌నాయుడు, ఏఈ మధు, నీటిపారుదల సంఘం డైరెక్టర్ సుధాకర్‌రెడ్డి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## క్లీనర్‌కు తీవ్ర గాయాలు - కేసు నమోదు

పోరుమామిళ్ల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఓ లారీ డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా క్లీనర్‌కు కాలు తొలగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. పోలీసుల వివరాల మేరకు.. గత నెల 11న పోరుమామిళ్ల మండలంలోని నాగులకుంట్ల సమీపంలో డీజల్ కోసం ఆపిన సమయంలో కొమరోలు మండలం గోనెపల్లెకు చెందిన లారీ క్లీనర్ కిందకు దిగుతుండగా డ్రైవర్ నిర్లక్ష్యంగా వాహనాన్ని నడపడంతో లారీ క్లీనర్ హుసేనయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన అతన్ని కడప రిమ్స్‌కు తరలించగా అక్కడ అతని కాలికి తీవ్ర గాయం కావడంతో ఎడమకాలు మోకాలు వరకు తొలగించారు. ఈ మేరకు బాధితుడి కుమారుడు మంగళవారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.




## వైవీయూ వీసీని కలిసిన కొండారెడ్డి

ప్రొద్దుటూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వైవీయూ వీసీ బెల్లం కొండ రాజశేకర్‌ను టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి మంగళవారం కలిశారు. కడపలోని యూనివర్శిటీకి వెళ్లి శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా యోగివేమన ఇంజనీరింగ్ కళాశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణ పనులపై చర్చించారు. వైవీ ఇంజనీరింగ్ కళాశాల నాన్‌టీచింగ్ స్టాఫ్ యూనియన్ అధ్యక్షుడు రసూల్ గౌస్ వున్నారు.


వీసీని సన్మానిస్తున్న కొండారెడ్డి

## పన్నుల వసూళ్లపై స్పెషల్ డ్రైవ్

ప్రొద్దుటూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పరిధిలో ఆస్తి, నీటి పన్ను వసూళ్లపై 90 రోజుల ప్రణాళికతో స్పెషల్ డ్రైవ్ చేపట్టినట్లు మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక మున్సిపల్ సభాభవనంలో అసిస్టెంట్ కమిషనర్ కొండయ్య, ఏసీపీ నాగరాజు మున్సిపల్ ఈఈ శ్రీనివాసులుతో కలిసి ఆయన సచివాలయ ఉద్యోగులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఆస్తిపన్ను బకాయిలతో పాటు నీటి పన్ను బకాయిలు కలిసి రూ.25 కోట్ల మేర వున్నాయన్నారు. డిసెంబరు నెల నుంచి మూడు నెలల పాటు ఈ స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామన్నారు. సమావేశంలో శానిటరీ సూపర్‌వైజర్ నూర్‌బాషా, సుబ్బరాయుడు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

## ప్రభుత్వాసుపత్రి తనిఖీ

బద్వేలుటౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిని మంగళవారం ఎమ్మెల్యే డాక్టర్ సుధ ఆకస్మిక తనిఖీచేశారు. అక్కడ ఉన్న రోగులతో మాట్లాడి వైద్యసేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలందించాలని సూచించారు.

**పోరుమామిళ్ల:** పోరుమామిళ్లలోని ప్రభుత్వ ఆసుపత్రిని ఎమ్మెల్యే డాక్టర్ సుధా తనిఖీ చేశారు. మంగళవారం సాయంత్రం ఆమె పోరుమమిళ్ల 50 పడకల ఆసుపత్రిని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె డాక్టర్లు, సిబ్బందితో మాట్లాడారు. కార్యక్రమంలో రంగసముద్రం సర్పంచ్ చిత్తరవిప్రకాశ్‌రెడ్డి, మాజీ ప్రభుత్వ సలహాదారుడు నాగార్జునరెడ్డి, జడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి లోకేశ్‌ను కలిసిన రవిశంకర్

బద్వేలుటౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను మంగళగిరిలోని సెక్రటేరియేట్‌లో ఎన్‌టీఏ సంఘం ఉపాధ్యాయుడు రవిశంకర్ మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో నోబుల్ టీచర్స్ అసోసియేషన్ అత్యంత చురుగ్గా ముందుంటోందని తెలిపారు.



## శబరిమలకు ఆర్టీసీ సేవలు

పోరుమామిళ్ల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రోడ్డు రవాణా సంస్థ బద్వేలు డిపో నుంచి అత్యాధునిక టెక్నాలజీ కలిగిన బస్సులు శబరిమల అయ్యప్పస్వామి కొండకు నడుపుతున్నట్లు బద్వేలు డిపో మేనేజరు నిరంజన్ తెలిపారు. మంగళవారం ఆయన పోరుమామిళ్ల ఆర్టీసీ బస్టాండులో పాత్రికేయులతో మాట్లాడుతూ శబరిమలకు వెళ్లే అయ్యప్పస్వాములకు ఆర్టీసీ నుంచి తక్కువ చార్జీలతో ప్రయాణ సౌకర్యం, మెరుగైన ఐదురోజుల ప్యాకేజీ టూరు, రాను పోను బద్వేలు నుంచి ఒక్కొక్కరికి సూపర్ లగ్జరీ రూ.4600 చెల్లించాలన్నారు. భక్తులు కోరుకున్న మార్గంలో పుణ్యక్షేత్రాలు దర్శించుకుంటూ వెళ్లేందుకు ప్యాకేజీ విధానం బస్‌చార్జీ, సూపర్ లగ్జరీ కి.మీ. 57 ఉంటుందన్నారు. అలాగే కలసపాడు తిరునాళ్లకు బద్వేలు డిపో నుంచి 2, మైదుకూరు డిపో నుంచి 2 బస్సులు నడుపుతున్నామన్నారు.













## క్రికెట్ టీం ఎంపిక

ఖాజీపేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఆసక్తి గల ఉపాధ్యాయులు మండల క్రికెట్ టీంగా ఎంపికయ్యారు. 13, 14 తేదీల్లో కడప డివిజన్‌లో క్రికెట్ పోటీల్లో పాల్గొనేందుకు టీంను ఏర్పాటు చేశారు. ఈ టీంను ఎంఈవో నాగరాజు, నాగార్జునలు అభినందించారు.

## అవగాహన సదస్సు

మైదుకూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వైసీపీని గ్రామస్థాయిలో బలోపేతం చేసి గ్రామ కమిటీలను ఏర్పాటు చేసేందుకు మంగళవారం మైదుకూరులో అవగాహన సదస్సు నిర్వహించారు. కడప ఎంపీ అవినాశ్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, తిరుపాల్‌రెడ్డి, రెడ్యం, ప్రసాద్‌రెడ్డి, కిరణ్మయి, శివరాం, మదీనా, దస్తగిరి కార్యకర్తలు పాల్గొన్నారు.

